# వేలంపాట

జీడిగుంట రామచంద్రమూర్తి

"చీకటిని తరిమివేస్తుంది... వెల్తురును నింపేస్తుంది... షాపులో కొంటే ఈ 'టార్చ్' ఖరీదు ఇరవై రూపాయలుంటుంది... పరీక్షించి చూసుకోండి బాబూ... గేరంటీ సరుకు... ఉత్సాహంగా పాడుకోండి!... దేవుడి పాట రెండ్రూపాయలు!...'

అప్సరా హోటల్ పక్కన గోడ వారగా నిలబడి - అతను వేలంపాట వేస్తున్నాడు... అతని చేతిలో టార్చిలైటుంది... పక్కనున్న ట్రంకు పెట్టెలో ఇంకా చాలారకాల వస్తువులూ బట్టలూ వున్నాయి.

హోటల్లో కాఫీతాగి అప్పుడే బయటకొచ్చిన వామన్రావ్, వేలంపాట విని- అప్రయత్నంగా అటువైపు నడిచాడు... అక్కడ వేలంవేస్తున్న వ్యక్తి చుట్టూ ఓ అరడజను మంది నిలబడి వున్నారు... అందులో ఒకడు టార్చిలైటు తీసుకుని పరీక్షిస్తున్నాడు...

"నా పాట అయిదు రూపాయలు!"- అన్నాడు దాన్ని తిరిగి ఇచ్చేస్తూ.

"ఆర్రూపాయలు"- మరొకడు అందుకున్నాడు.

అలా వాళ్ళిద్దరూ ఒకో రూపాయి చొప్పునే పెంచుకుంటూ వేలం పాడుతూంటే- వాళ్ళవైపు చూస్తూ నిలబడి పోయాడు వామన్రావ్!

పన్నెండు రూపాయల దగ్గర పాట ఆగిపోయింది...

"ఒకటోసారి పన్నెండురూపాయలు... రెండోస్సారి పన్నెండు..." అందరివైపూ చూస్తూ ఆగిపోయాడు వేలంవేస్తున్న వ్యక్తి...

ఇంకెవ్వరూ ఎక్కువ ధర పలక లేదు.

"చూడండి సార్! దీని ఖరీదు ఇరవై!... పన్నెండుకే ఇచ్చేస్తే నాకు ఎనిమిది నష్టమవుతుంది...అంచేత దీని వేలం కేన్సిల్ చేస్తున్నా!"- అన్నాడతను...

"వీల్లేదు! పాట ఎంతలో ఆగిపోతే- అంతకే ఇచ్చేయాలి!"- అన్నాడు పన్నెండు రూపాయలకు పాడిన మనిషి.

"సరుక్కి గిట్టుబాటుధర పలక్కపోతే- వేలంపాడిన కష్టమర్కి తృణమో పణమో ఇచ్చి-దాని వేలం కేన్సిల్ చేసే హక్కు మాకుంటుంది సార్"-అంటూ అతను పర్సులోంచి రెండ్రూపాయల నోట్లు రెండు తీశాడు...

"వుంచండి...నాలుగు రూపాయలు!" -అని వేలంపాడినవ్యక్తి చేతిలో పెట్టాడు.

ఇప్పుడు తన పెట్టెలోంచి ఓ సిల్కు చీర తీశాడు వేలంవేసే వ్యక్తి...

"సూపర్ స్పెషల్ శారీ!... జైనా నించి వచ్చింది. షాపులో వందకి తక్కువ వెడితే - నా చెవి కోయించుకుంటాను... క్వాలిటీ చూసి పాట పాడండి సార్!... పది రూపాయల్తో పాట ప్రారంభిస్తున్నాను..."- ఆ సిల్కు చీర మడతలన్నీ విప్పేసి- దాన్ని అందరిమీదకూ విసురుతూ అన్నాడు.

ముదురు నీలంరంగులో వున్న ఆ చీర - ఎర్రటి బోర్డరుతో మెరిసిపోతోంది...

దాన్ని చూడగానే వామన్రావ్ కళ్ళు కూడా మెరిశాయి. ఆ మెరిసేకళ్ళవెనక ఆలోచనల్లో శారద కనిపించింది...

"శారద ఈ చీర కట్టుకుంటే చాలా అందంగా ఉంటుంది"- అనుకున్నాడు..

ఆమాటకొస్తే శారద ఏ చీర కట్టుకున్నా బ్యూటిఫుల్‌గానే వుంటుందని అతనికి తెలుసు... ఆ సంగతి ఆర్నెల్ల క్రితం తాను పెళ్ళిచూపులకు వెళ్ళినప్పుడే గ్రహించాడు.

నిజానికి అప్పట్లో- అంటే ఆర్నెల్ల క్రితం అతనికి పెళ్ళిచేసుకోవాలనే ఉద్దేశ్యం లేనేలేదు! 'ఉద్యోగం లేనివాడికి పెళ్ళేమిటి'- అనుకున్నాడు... అమ్మపోరు పడలేక పెళ్ళిచూపులకు వెళ్ళాడు... పిల్ల నచ్చలేదని చెప్పేస్తే గొడవ వదిలిపోతుందనుకున్నాడు.

తీరా పెళ్ళిచూపులకు వెళ్ళింతర్వాత- తన ముందుకు శారదను తీసుకొచ్చి కూర్చోబెట్టగానే - సర్వం మర్చిపోయాడు. "అతి సామాన్య మామూలు" చీర కట్టుకుంది...మెడలో నగలు లేవు... జడలో పూలు లేవు!... అయినా పసిడిఛాయతో ఆమె అప్సరసలా కనిపించింది... ఆ కళ్ళల్లో కొంటెతనం... బుగ్గల్లో సిగ్గుదనం... చూపుల్లో చురుకుదనం... నవ్వులో నవ్వుదనం... 'ఎట్ సైటూ ఎట్ సైటూ'లన్నీ కలిసి తన ఉద్దేశ్యాన్ని తారుమారు చేశాయి...

అర్జంటుగా ఆమె నచ్చిందని చెప్పకపోతే- వాళ్ళు వేరే సంబంధానికి పోవచ్చుననే భయంతో, అప్పటికప్పుడే, అక్కడే తన అభిప్రాయాన్ని చెప్పేశాడు...


ఆ విధంగా శారద తన అర్ధాంగి అయింది... పెళ్ళయి నెలరోజులు తిరక్కుండానే వామన్రావ్‌కి రాజమండ్రిలో ఉద్యోగం వచ్చేసింది...

"పెళ్ళాం వచ్చిన వేళావిశేషం!" అన్నారందరూ! ఆమాటని అక్షరాలా నమ్మేసిన వామనరావ్‌కి శారదపట్ల ప్రేమాభిమానాలు పెచ్చు పెరిగిపోయాయి... ఉద్యోగంలో చేరిన నెలరోజులకే-ఆర్యాపురంలో ఓ చిన్న వాటా అద్దెకు తీసుకుని- కాపరం పెట్టేశాడు...పువ్వులతో ఆమెను పూజించలేకపోయినా- రోజూ పువ్వులు కొని ఇస్తున్నాడు...

అదే ఉత్సాహంతో...

చుట్టూవున్న మనుషులు ఒక్కసారిగా తనవైపు చూసేసరికి, కించిత్ గర్వం కూడా కలిగింది వామనరావ్‌కి.

"వెరీగుడ్... ఈ సార్‌కి ఏమీ విలువ తెలియకనకే- నలభై పెట్టారు! ... అయినా నాకింకా నష్టమే ... ఎవరైనా పైపాట పాడుకోవచ్చు... వంద రూపాయల చీర... నలభై రూపాయలు!



"ముప్ఫయ్‌రూపాయలు ఒకటోసార్ ... ముప్ఫయ్‌రూపాయలు రెండోస్సార్"- వేలంవేస్తున్నవ్యక్తి బిగ్గరగా అరుస్తూంటే ఆలోచనల్లోంచి తేరుకున్నాడు వామనరావు.

"ఆలోచించకండిసార్! వందరూపాయలు ఖరీదుచేసే చీర! ఉత్సాహంగా పాడండి!"- హెచ్చరిస్తున్నాడు వేలంవేసే వ్యక్తి.

వామనరావ్ తలపుల్లో శారద రూపమే నిండిపోయిందేమో - బోర్నవీటా తాగినంత ఉత్సాహం వచ్చింది...

"నలభై రూపాయలు!" అన్నాడు ..." మళ్ళీ ఆ చీరను చుట్టూవున్నవాళ్ళ మొహాలమీదకు ఝళిపించాడు...

వామనరావ్‌కి కొంచెం అధైర్యం కలిగింది... 'వేలంవేస్తున్నవ్యక్తి అక్కడవున్నవాళ్ళను మరీ రెచ్చగొడుతున్నాడేమో' అనిపించింది...

'ఏమైనా సరే బేరం విడిచిపెట్టకూడదు... శారద ఈ చీర కట్టుకుంటే ఎంత బాగుంటుందనీ?'...అసలు తనకు నీలంరంగు చాలా ఇష్టమని మొదటి రాత్రే చెప్పింది...

ఇప్పుడీ చీర కొని పట్టుకెడితే-తమ కొత్తకాపురంలో ఇది తన భార్యకు ఇచ్చే తొలికానుకే అవుతుంది!

"హే భగవాన్!- ఇంకెవరూ పాట పెంచకుండా చూడు తండ్రీ!"—మనసులో దేవుణ్ణి ప్రార్థించుకున్నాడు... డబ్బు తీసి ఇచ్చేందుకు- రెడీగా జేబులో చెయ్యి కూడా పెట్టేసుకున్నాడు...

"ఒకటోసార్ నలభై రూపాయలు..... రెండోస్సార్ నలభై రూపాయలు...మూడోస్సార్..." ఇంకా పూర్తి చేయలేదు...

సరిగ్గా అప్పుడే-

"ఏభై!" అన్నారెవరో...

వామనరావ్‌కి ఏడుపు రాలేదు... కోపం వచ్చింది... దానికి సాయం పౌరుషం కూడా వచ్చేసింది. 'ఏభై' అన్నది ఎవరా అని చూశాడు.

ఇందాకా టార్చిలైటు పన్నెండుకి పాడి, నాలుగురూపాయలు జేబులో వేసుకున్నాడు- వాడే!

'వే!వే. వ్యక్తి తనకు నష్టంవస్తుందని- మళ్ళీ పదో పరకో చేతిలో పెడతాడని ఆశపడుతున్నాడు కాబోలు'-

అనుకుంటూ వాడివైపు చూసి పళ్ళు కొరుక్కున్నాడు వామనరావ్.

వాడు గర్వంగా చూసి-ఓసారి కాలరు సర్దుకుని, జేబులోంచి సిగరెట్టు తీసి వెలిగించుకున్నాడు.

'చాల్లే తగ్గరా... బోడి గొప్పవాడివ్వా:- ఇంత అందమైన చీర కొనుక్కెళ్ళగానే సరిపోదు... ఇంటి దగ్గర అందమైన పెళ్ళాం కూడా వుండాలి దాన్ని కట్టుకోడానికి! నీ కోతి మొహానికి అందమైన పెళ్ళాం ఎలాగా దొరికుండదు!' — కసిగా తిట్టుకున్నాడు వామనరావ్.

వేలం వేసేవ్యక్తి అరుస్తున్నాడు...

"ఓ బాబు పాట ఏభై రూపాయలు! ఆలస్యం చేయకండి సార్... ఇంకా మంచిమంచి 'అయిటమ్స్' చాలా వున్నాయి ... చూపిస్తాను. త్వరగా పాడండి! అప్సరసలు కట్టే అందమైన సిల్కుచీర... యాభై రూపాయలు". "అరవై!" అనేశాడు వామనరావు.

"మరో దొరబాబు పాట అరవై! పందరూపాయల చీర అరవై! పాడుకోండి సార్!" —

వే.వే. వ్యక్తి అరుస్తూంటే అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. అంతకుముందు యాభైకి పాడినవ్యక్తి జేబులోంచి డబ్బు బయటకు తీసి - లెఖ్ఖ పెట్టుకున్నాడు.

"సారీ!... నా దగ్గర యాభయ్యే వున్నాయి!" - అన్నాడు. తానింక పై పాట పాడలేనట్టుగా.

"ఇక పాటెందుకూ? చూడబోతే ఈ శారీమీద మీరు మోజుపడుతున్నట్టున్నారు. మీరే తీసుకోండి సార్!. అదృష్టవంతులు... వంద రూపాయలు పెట్టినా దొరకని 'శారీ' అరవైకే పట్టుకుపోతున్నారు!"- మడతపెట్టి - కవర్లో కూడా పెట్టి వామనరావ్‌కి అందిస్తూ అన్నాడు వే.వే. వ్యక్తి.

అరవై రూపాయలూ ఇచ్చేసి కవరు అందుకున్నాడు వామనరావ్!.

* * *

"ఎంతపెట్టి కొన్నారు?"- చీరమడతలు విప్పి చూస్తూ అడిగింది శారద.

"వంద!"- రియాక్షన్ ఎలా వుంటుందో చూద్దామనుకున్న వామనరావ్ అసలు ధరకు మరో నలభై కలిపి చెప్పాడు.

ఆశ్చర్యంగా చూసింది శారద భర్త వైపు.

"ఏం? అంత ఖరీదుండదా?"- ఆత్రంగా అడిగాడతను.

"అందుకని కాదు! మా ఆడవాళ్ళని వ్యాపారస్తులు ఎలా మోసం చేస్తారో తల్చుకుంటే ఆశ్చర్యం వేసింది!" చెప్పింది.

"అంటే-?"

మన పక్కింటి పాపాయమ్మ లేరూ- సరిగ్గా ఇలాంటి చీరే నూట యాభై రూపాయలు పెట్టి కొనుక్కొచ్చింది మొన్న. ఆ కొట్టువాడు ఆవిడకు యాభై రూపాయలు టోపీ వేశాడన్న మాట!" తన భర్త తెలివిగా వ్యవహరించి తక్కువ ధరకు చీర తెచ్చాడనే ఆనందంతో పొంగిపోయిందామె.

ఆ పొంగిపొరలే ఆనందాన్ని- మర్నాడు పొద్దున్న, వామనరావ్ ఆఫీసుకి వెళ్ళగానే-పాపాయమ్మగారితో పంచుకోవాలని - చీరతో సహా వాళ్ళింటికి వెళ్ళింది.

ఇద్దరూ తమ చీరల్ని పక్కపక్కనే పెట్టి చూసుకున్నారు. దాదాపు రెండూ ఒక్కలాగానే కనిపించాయి.

"ఏమోనమ్మా! ఈ బట్టల్లో కూడా రకాలు చాలా వుంటాయి. అయిదు వందల చీరా - ఏభై రూపాయల చీరా ఒక్కలాగా వుంటాయి. నమ్మటానికి వీల్లేదు!"- శారదకంటే వయసులో ఓ ఇరవై ఏళ్ళు పెద్దయిన పాపాయమ్మ- అప్పటికి ఆ రంగంలో తాను సంపాదించిన అనుభవంతో చెప్పింది.

"అయితే-కొంపతీసి మా ఆయన టోపీలో పడలేదు కదా?" అనుకుంది శారద ఆ క్షణాన.

"చెప్పలేం! అయినా ఆ షాపువాడు మాకెప్పుడూ బట్టలు ఇస్తూనే వుంటాడుగా! సాయంత్రం వెళ్ళి రెండు చీరలూ చూపించి ధరలో ఇంత తేడా ఎందుకొచ్చిందో అడిగేద్దాం!" చెప్పింది పాపాయమ్మ.

"సాయంత్రం దాకా ఎందుకూ! ఇప్పుడే వెడదాం!"- శారద తొందర పెట్టింది.

మరో అరగంట సేపట్లో - ఇద్దరూ ఆ బట్టల కొట్టుకి వెళ్లారు. విషయమంతా విన్న షాపు యజమాని చెయ్యి నోటికి అడ్డంపెట్టుకుని మరీ నవ్వేశాడు.

ఎందుకలా నవ్వుతున్నాడో అర్థం కాక- పాపయమ్మా, శారదా ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

అలా ఆయాసం వచ్చేదాకా నవ్వేసి- అసలు సంగతి చెప్పాడు షాపు యజమాని.

"ఇది డూప్లికేటు వెరైటీ! ముప్ఫయ్ రూపాయలకంటే ఎక్కువుండదు!"

శారద షాకయింది.

"అందరూ అలాగే చెప్తారులెండి... మీ కొట్లో కొంటేనేమో మంచిది. మరో చోట కొంటే చెడ్డది! అంతేగా?"- పౌరుషంగా అంది, తన భర్త తెలివితేటల మీద అపారమైన నమ్మకంతో.

"మీరెక్కడ కొంటే మాకేవమ్మా? ఉన్నమాట చెప్పాం!. కావాలంటే ఓ 'వాష్' అయ్యాక చూడండి దాన్ని! రంగంతా పోయి మూడు గజాలుగా ముడుచుకుపోతుంది!"

"వాష్ చేసిన తర్వాత కూడా ఇలాగే వుంటే?"- కోపంగా అడిగింది. శారద.

"ఈ బట్టలకొట్టు మీ పేర రాసేసి- నేను ముష్టెత్తుకు బతుకుతాను!" ఛాలెంజ్ విసిరాడు షాపుయజమాని.

అతనలా మాట్లాడటం - చాలా అవమానమనిపించింది శారదకి. వెంటనే ఇంటికొచ్చేసి; పాపాయమ్మ సమక్షంలోనే ఆ చీరను నీళ్ళల్లో తడిపింది. అయిదు నిముషాలు దాన్ని అలా నీళ్ళల్లోనే వుంచి తర్వాత బయటకు తీసింది!

ఆశ్చర్యం!

ఆ షాపుయజమాని శాపం పెట్టినట్లుగా- చీర రంగంతా నీళ్ళల్లో కలిసిపోయింది. ఓ గంట ఎండలో ఆరేసిన తర్వాత చూస్తే బట్టకూడా కుంచించుకుపోయింది.

"అయినా వేలంవాళ్ళదగ్గర ఏమీ కొనకూడదమ్మా. పూర్వం ఇలాగే ఓసారి..."

ఆవిడ ఏమిటేమిటో చెప్పేస్తోంది. శారదకు ఒక్క మాట కూడా వినిపించడం లేదు. ఆలోచిస్తూ వుండిపోయింది.


సాయంత్రం ఆరుగంటల వేళ వామనరావ్ ఆఫీసునించి ఈల వేసుకుంటూ ఇంటికొచ్చేడు. కొత్త చీర కట్టుకుని మల్లెపూలు పెట్టుకుని కాఫీ కప్పుతో ప్రత్యక్షమవుతుందనుకున్న శారద జడకూడా అల్లుకోకుండా చాలా డల్‌గా కనిపించేసరికి వామనరావ్ అల్లాడిపోయాడు. ఈల ఆగిపోయింది.

"పదిరోజుల క్రితమేగా స్నానమయిందీ?"- అన్నాడు అనుమానంగా చూస్తూ.

"అంటే?"- చిరాకుపడింది శారద.

"మరేంలేదు! మాసిన చీరతో అలా జడకూడా అల్లుకోకుండా డల్‌గా కనిపిస్తూంటే మనసేదో కీడు శంకించీ..." వేళాకోళంగా అన్నాడు.

"పాడు మాటలు మాట్లాడకండి. నా కసలే బాధగా వుంది!" ముఖం మరో



వైపు తిప్పుకుంటూ చెప్పింది.

"దేనికోయ్ బాధ?" ఆమెను దగ్గరిగా లాక్కుంటూ లాలనగా అడిగాడు.

"మీరు మోసపోయినందుకు!"

అర్థంకాలేదు వామనరావుకి.

"ఆ వేలంపాటగాడెవడో మీకళ్ళల్లో దుమ్ము కొట్టాడు" అంటూ గబగబా వెళ్ళి చీర తెచ్చి చూపించింది. జరిగిన విషయమంతా వివరించింది.

ముడుచుకుపోయి, అసలు రంగేంటో అర్థంకాకుండా మారిపోయిన ఆ చీరను చూసేసరికి అంతక్రితంరోజు జరిగిన వేలంపాట సీనంతా 'ఫ్లాష్‌బాక్'లా కళ్ళముందు కదిలింది వామనరావ్‌కి.

"ఎంత మోసం చేశాడు?"-అనుకున్నాడు.

అతనిలోని యువకరక్తం ఉడికిపోయి కళ్ళల్లోకి చిమ్ముకొచ్చింది. నరాల్లోవున్న శక్తి యావత్తూ పిడికెళ్ళకు చేరుకుంది.

"ఇప్పుడేవెళ్ళి దీన్ని వాడి మోహాన కొట్టి నా డబ్బిమ్మంటాను" అన్నాడు దాన్ని కాగితంలో చుట్టబెట్టి.

"అక్కడ వాడు వుండద్దూ?"

"నిన్న వున్నవాడు ఇవాళ వుండడా? చూస్తాను. లేకపోతే అక్కడి వాళ్ళను తెలుసునేమో అడుగుతాను. మర్యాదగా చీర తీసుకుని డబ్బిస్తాడా సరేసరి! లేకపోతే నాయగుతికి పోలీసులకు అప్పగిస్తాను!" అంటూ ఆవేశంగా బయటకు నడిచాడు వామనరావ్...

పదినిమిషాల్లో అతను అప్సరా హోటల్ చేరుకున్నాడు. అంతకుముందు రోజున వేలంపాట వేసిన వ్యక్తి ఆ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా కనిపించలేదు. పక్కనేవున్న కిళ్ళీ కొట్టులో వాకబు చేశాడు.

"అతను రోజూ రాడుసార్! అయినా రోడ్డుమీద వ్యాపారంచేసేవాడికి రోజూ ఒకే చోటని ఏముంది?" చాలా తేలిగ్గా చెప్పాడు కిళ్ళీకొట్టు మనిషి.

వామనరావ్ నిరాశగా వెనక్కి తిరిగాడు. వృధాగా అరవై రూపాయలు పోయాయన్న బెంగలో ఆ రాత్రి అన్నం తినాలనిపించలేదు అతనికి.

* * *

సినిమా ఆరోజే రిలీజయిందేమో థియేటర్ దగ్గర బాగా జనం వున్నారు. వామనరావ్ అక్కడకు వచ్చేసరికి అన్ని బుకింగులదగ్గరా కొల్లేటి చాంతాడల్లే

'క్యూ'లు కనిపించాయి. క్యూలోకి వెళ్ళి నిలబడితే టిక్కెట్టు దొరుకుతుందనే గేరంటీ లేదు...

ఏం చేయాలో తోచలేదు వామన్రావ్‌కి. అటూ ఇటూ చూశాడు. అప్రయత్నంగా అతని చూపులు ఓ వ్యక్తిపై నిలిచిపోయాయి.

అతన్ని సులువుగానే గుర్తుపట్టాడు వామన్రావ్. ఇరవై రోజుల క్రితం వేలంపాటలో చీరను యాభై రూపాయలకు పాడింది అతనే!...

గబగబా అతని దగ్గరకు నడిచాడు.

"మూడు రూపాయల టిక్కెట్టు అయిదు రూపాయలు! రెండే వున్నాయి కావాలాసార్?" వామన్రావ్‌ని చూడగానే అడిగాడు అతను.

అయితే వామన్రావ్ సినీమా విషయం పూర్తిగా మర్చిపోయాడు.

"నేను గుర్తున్నానా?" సీరియస్‌గా అడిగాడు.

అతను గుర్తు రాలేదన్నట్టుగా మొహం పెట్టేడు!

"ఆరోజు అప్సరా హోటల్ దగ్గర వేలంపాటలో-" వామన్రావ్ అమాత్రం అందించేసరికి అతనికి జ్ఞాపకం వచ్చేసింది.

"ఆ! ఆ! ఇప్పుడు గుర్తొచ్చింది సార్! ఆరోజు వేలంపాటలో మీరు చీర కొన్నారుగా?" ఉత్సాహంగా అన్నాడు.

"అవును! ఆ 'వేలంపాటగాడి' కోసం మళ్ళీ చాలాసార్లు అప్సరాహోటల్ దగ్గరకు వెళ్లాను. కనిపించలేదు. వాడి ఎడ్రస్ కావాలి!" అడిగాడు వామన్రావ్.

"ఎందుకుసార్?"

"మాయచేసి అరవై రూపాయలు కొట్టేశాడు! వాడిచ్చిన చీర ఎందుకూ పనికి రానిది! అందుకే వాడెక్కడుంటాడో చెప్తే పోలీసులకు పట్టిస్తాను!"

"వాడెవడో నాకూ తెలీదు సార్!"

ఆరోజు సాయంత్రం, అక్కడి పార్కులో బెంచీమీద పడుకుని నేను నిద్రపోతూంటే వాడొచ్చి లేపాడు. తను వేలంవేసే వస్తువుల్ని ఎవరైనా పాడితే దానికంటే అయిదో పదో ఎక్కువకి నన్ను పాడమన్నాడు. అలా పాడితే ఆ వస్తువుకి రేటు ఎక్కువ పలుకుతుందనీ నిజంగా దాన్ని కొనదల్చుకున్న వారికి నమ్మకం కుదురుతుందనీ చెప్పాడు నాకు 'టెన్ పర్సంట్' కమీషన్ ఇస్తానన్నాడు!"

అసలు విషయం బోధపడింది వామన్రావ్‌కి.

"అంటే ఆరోజు నువ్ ఆ చీర కావాలని పాడలేదన్నమాట?" అడిగాడు ఆవేశంగా.

"లేదుసార్! కేవలం పట్టుదలతో మీరు దానికి మరింత ఎక్కువపెట్టి కొంటారనీ-"

"ఒకవేళ నేను ఎక్కువపెట్టివుండక పోతే?" కోపంగా అడిగాడు వామన్రావ్.

"ఏముందీ? బ్యాట్రీలైటుకి నాలుగు రూపాయలిచ్చినట్టే - ఆ చీరక్కూడా పదో పరకో నష్టపరిహారం ఇచ్చేవాడు. తర్వాత ఆ డబ్బు మళ్ళీ వాడికే ఇచ్చేయమన్నాడులెండి!"

"ఎంత మోసం?" పళ్ళుకొరుక్కున్నాడు వామన్రావ్.

"కోటి విద్యలు కూటికోసమే కద సార్?" అంటూ, అతను మరోవైపు వెళ్ళిపోయాడు....

వామనరావ్ కళ్ళు ఎర్రబడ్డాయి. అతనిలో వున్న యువకిరక్తం ఉడికిపోయి కళ్ళల్లోకి చిమ్ముకొచ్చింది. నరాల్లోవున్న శక్తియావత్తూ పిడికిళ్ళకు చేరుకుంది. కాలిదగ్గరున్న రాయిని విసురుగా తన్నేసి రోడ్డుమీదకు నడిచాడు.

♦ ♦ ♦

పోస్టులో వచ్చిన ఇన్‌లాండ్ కవరు చదువుకుని పొంగిపోయాడు వామన్రావ్....

"ఏమేవ్!" అంటూ వంటగదిలోకి కేకపెట్టాడు హుషారుగా.

"ఏమిటీ ఎందుకలా అరుస్తారు?" వంటగదిలోంచి హాల్లోకి వచ్చిన శారద భర్త పక్కనేవున్న కుర్చీలో కూర్చుంటూ అడిగింది.

"పెళ్ళివారు ఉత్తరం రాశారోయ్! మన అమ్మాయి వాళ్ళకి నచ్చిందట!"

"నిజంగా?" నమ్మలేనంత ఆశ్చర్యపోయింది శారద.

దాన్ని ఆశ్చర్యం అనటం కంటే ఆనందమంటేనే సబబుగా వుంటుంది.

"మన పరిమళ అదృష్టవంతురాలు!" అంది తృప్తిగా కళ్ళల్లో ఆనందబాష్పాలు నిలుస్తూండగా!


"తొందరగా వస్తే తక్కిన విషయాలన్నీ మాట్లాడుకుని ముహూర్తాలు పెట్టుకోవచ్చని రాశారు సీతారామయ్యగారు!" చెప్పాడు వామన్రావ్ ఆ కవరు మళ్ళీ మరోసారి చదివి.

"మరింకనేం? రేపే బయల్దేరి వెళ్ళండి!"

"రేపే అంటే ఎట్లా? మనం ఎప్పుడొచ్చేదీ ముందుగా తెలియపర్చమన్నాడు. ఆ వేళకి వాళ్ళ బంధువుల్నీ ముహూర్తంపెట్టే పంతులుగార్నీ పిలుస్తాడట. వచ్చే సోమవారం అన్ని విధాలా బాగుంది. ఆరోజు వస్తానని ఉత్తరం రాస్తాను!" అన్నాడు కవరు మడిచి జేబులో పెట్టుకుంటూ.

"ఏమైనాసరే ఈ సంబంధం దాటిపోకుండా చూడండి. ఎలాగా పాతిక వేలివ్వటానికి సిద్ధపడివున్నాం. ఇంకో అయిదూ, పదీ అయినా ఖాయంచేసుకురండి. అబ్బాయి డాక్టరు కూడానూ!" శారద కళ్ళు ఆశగా మెరిశాయి ఆ మాటలంటూంటే.

♦ ♦ ♦




సోమవారం సాయంత్రం నాలుగ్గంట లవుతున్న సమయంలో బస్సుదిగి రిక్షాలో సీతారామయ్య ఇంటికి చేరుకున్నాడు వామన్రావ్. హాల్లోనే కూర్చున్న సీతారామయ్య అతన్ని సాదరంగా ఆహ్వానించాడు.

పలకరింపులు పూర్తయిన తర్వాత ఫలహారాలు తెప్పించాడు. కతికితే అతకదనే సామెత గుర్తుకొచ్చి కాబోలు ఫలహారం పక్కనపెట్టి కాఫీతో సరిపెట్టుకున్నాడు వామన్రావ్.

"వీరు శ్యామలరావుగారు! అమలాపురం నించి వచ్చారు!" ఆ- పక్కనే మరో సోఫాలో కూర్చొనివున్న పెద్దమనిషిని వామన్రావ్‌కి పరిచయం చేశాడు సీతారామయ్య- కాఫీ తాగటం పూర్తయ్యాక.

వామన్రావ్ ఆయనకు నమస్కరించేడు.

సీతారామయ్య వెంటనే చెప్పటం ప్రారంభించాడు.

"శ్యామలరావ్‌గారికి ఒక్కత్తే అమ్మాయి. మొన్ననే బి.ఏ. పాసయిందట. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే వారమ్మాయిని మా అబ్బాయి కివ్వాలనుకుంటున్నారట! ఏకంగా ఫోటో కూడా తీసుకొచ్చారు... చూడండి!" అంటూనే టీపాయ్‌మీదనున్న ఫోటోతీసి వామన్రావ్‌కి అందించాడు.

ఆయనవైపు అయోమయంగా చూస్తూ అప్రయత్నంగా ఫోటో అందుకున్నాడు వామన్రావ్... దిగులుకళ్ళతో- ఆ ఫోటోలోకి చూశాడు. పిల్ల పరిమళకంటే ఓ పిసరు అందంగా వున్నట్టే అనిపించింది! చదువుకూడా ఎక్కువే!

ఏం మాట్లాడాలో తోచలేదు వామన్రావ్‌కి. అయినా పరిమళ నచ్చిందని రాసిన పెద్దమనిషి ఇప్పుడు మళ్ళీ మరో పిల్ల ఫోటో మాత్రం ఎందుకు చూడాలి? అసలు విషయాన్ని ఆ పెద్దమనిషికి చెప్పేయచ్చుగా?

"ఎట్లా వుందంటారు పిల్ల?" అడిగాడు సీతారామయ్య.

ఫోటోచూసి ఏం చెప్పగలం లెండి!" నీళ్లునమిలాడు వామన్రావ్.

ఆ మాట వినగానే - శ్యామలరావు సోఫాలో అసహనంగా కదిలాడు.

"అందుకే సీతారామయ్యగార్నీ అబ్బాయినీ- ఒక్కసారి అమలాపురం దయచేసి- మా అమ్మాయిని చూసుకోమంటున్నాడు.

"ఎట్లా కుదురుతుందండీ? ... ఓ వారంరోజులు ముందుగానైనా రాకపోతిరి!... తీరా 'వీరిపిల్ల నచ్చిందనీ, తక్కిన విషయాలు మాట్లాడుకుందాం రమ్మనీ' నేను ఉత్తరం రాశాను... అందుకే ఇప్పుడు వీరు వచ్చారు!"- అసహనంగానే చెప్పాడు సీతారామయ్య.

"నిజమేననుకోండి!... అయినా పీటలమీద పెళ్ళిళ్ళే ఆగిపోతున్న ఈ రోజుల్లో మాటలదగ్గరే ఆగిపోయినంత మాత్రాన తప్పేముంది చెప్పండి?... పిల్ల నచ్చిందన్నారు కానీ ఖాయపరచుకోలేదుగా?...ఒక ఆడపిల్ల తండ్రిగా నా తొందర నాది!... నా ఆశ నాది!... అందుకే ఒక్కసారి అమలాపురం వచ్చి అమ్మాయిని చూసుకోండి!... నచ్చకపోతే గొడవే లేదు!... నచ్చిందంటే చెప్పండి...ఏభైవేలు కట్నం ఇస్తాను.. లాంఛనాలకు ఏ లోటూ రానివ్వను... చెప్పానుగా! ఒక్కత్తే పిల్ల!... మా తర్వాత ఆస్తి యావత్తూ దానిదే!" -

శ్యామలరావ్ ఆత్రంగా అలా చెప్తూంటే- వామన్రావ్‌కి ముచ్చెమటలూ పోస్తున్నాయి ... కొంపదీసి సీతారామయ్య ఒప్పుకుంటాడేమోనన్న భయం కూడా అతని ఆలోచనల్లో చోరబడింది.. ఊపిరి తీసుకోవటం మర్చిపోయి- సీతారామయ్య చెప్పే సమాధానంకోసం ఎదురుచూస్తున్నాడు!...

రెండు నిమిషాల నిశ్శబ్దం తర్వాత నోరువిప్పాడు సీతారామయ్య.

"చూడండి శ్యామలరావ్‌గారూ!... ఓ పిల్ల నచ్చిందని అనుకున్నాక-మరో పిల్లను చూడాలనుకోవటం ధర్మంకాదు. వామన్రావ్‌గా రమ్మాయికంటే మీ పిల్ల అందంగానే వుండవచ్చు... చదువు కూడా ఎక్కువే కావచ్చు... అయినా అందానికి హద్దెక్కడ చెప్పండి?...ఇక కట్నం కానుకలంటారా?... ఆ విషయంలో వామన్రావ్‌గారు తక్కువచేస్తారని నేననుకోను!... మీకు వున్నట్టు వారికి కొబ్బరితోట లేకపోతే లేకపోవచ్చు... ఇంటల్లుడిగా రాబోయే డాక్టరు కుర్రాడికి ఓ యాభైవేలిచ్చుకోలేని అసమర్థులు మాత్రం కారని నాకు తెలుసు!.. అయినా డబ్బు ముఖ్యం కాదండీ!... మాట ముఖ్యం!... పిల్ల నచ్చిందని వారికి నేను మాట ఇచ్చాను... కనక మీరు నన్ను మన్నించి వెళ్ళిరండి!"— అంటూ వినయంగా నమస్కరించాడు.

"సరే...మీ ఇష్టం! ఒకవేళ కట్నం కానుకల విషయంలో వీరు ఓ అడుగు వెనక్కివేస్తే- అప్పుడైనా మాకు అవకాశం ఇప్పించండి!" అంటూ సీతారామయ్య దగ్గర శలవు తీసుకున్నాడు శ్యామలరావు.

వామనరావు తృప్తిగా నిట్టూర్చాడు.

♦ ♦ ♦

"నమస్తే సార్!" అంటూనే దరఖాస్తును ఆఫీసరుగారి ముందుపెట్టాడు వామన్రావ్.

"ఏమిటయ్యా ఇది?" దాన్ని తీసుకుని చూస్తూ అడిగాడాయన.

"లోన్ అప్లికేషన్ సార్! నా ప్రావిడెంట్ ఫండ్ లోంచి పాతిక వేలు కావాలి!... మా అమ్మాయికి పెళ్ళి కుదిరింది!"— చెప్పాడు.

"వెరీగుడ్! అబ్బాయి ఉద్యోగం చేస్తున్నాడా?"

"ఇంకా లేదు సార్!... మెడిసిన్ చదివాడు!"

"గుడ్! అయితే కట్నం ఎక్కువే అయ్యుండాలి!"— నవ్వుతూ అన్నాడు ఆఫీసరు.

"తప్పదుగదండీ!... యాభై వేలు అడిగారు!... ఆ మధ్య మా వూళ్ళో పొలం అమ్మిన డబ్బు ఓ ముప్ఫయ్‌వేలు వున్నాయి!... అందుకే ఇంకో పాతిక లోన్ తీసుకుంటే- ఆ శుభకార్యం కాస్తా అయిందనిపించేయచ్చు!"—

"వాళ్ళకి ఆస్తిపాస్తులు బాగా వున్నాయా?"— ఆఫీసరు ప్రశ్నించాడు మళ్ళీ.

"ఫరవాలేదులెండి! అబ్బాయి తండ్రికి ఏలూర్లో పెద్ద మేడ వుంది... 'సీతారామా టెక్స్‌టైల్స్' అని పెద్ద బట్టల షాపు కూడా వుంది!"

"అయిసీ!... అంటే మా సీతారామయ్యగారి అబ్బాయేనన్నమాట!"— ఉత్సాహంగా అడిగాడు ఆఫీసరు.

"అంటే... ఆయన మీకు తెలుసా సార్?"— కుతూహలంగా అడిగాడు వామన్రావ్.

"భలేవాడివే... తెలీకపోవటం ఏమిటీ?...: మాకు దూరపు బంధువు కూడా!... కష్టపడి పైకొచ్చిన మనిషి... ఇరవై ఏళ్ళ క్రితం అతను రాజమండ్రిలో మా ఇంటిపక్కనే అద్దెకుండేవాడు... చెబితే నమ్మవ్!... అప్పట్లో బొంబాయినించి చీప్ వెరైటీ బట్టలు తెచ్చి- రోడ్డుమీద బిజీగావుండే సెంటర్లలో వేలంవేసేవాడు!...వాటిమీద బాగా సంపాదించాడు... ఆ డబ్బుతోనే ఏలూర్లో స్థలంకొని మేడకట్టాడు... ఏమైనా బతకనేర్చినవాడు!"

ఆఫీసర్ చెప్పినమాటలు వింటూంటే -కరెంట్‌షాక్ తిన్నట్టుగా అయిపోయాడు వామన్రావ్! ... ఇరవై ఏళ్ళ క్రితం రాజమండ్రిలో అప్సరాహోటల్ దగ్గర వేలంపాటలో - తాను చీరకొని ఎలా మోసపోయిందీ-సినీమాదృశ్యంలా కళ్ళముందు కదిలింది.

"కరక్టే! వాడే వీడు!"— అన్నాడు వేలంవేసిన వ్యక్తి రూపాన్ని మనసులోకి తెచ్చుకుంటూ అనుకున్నాడు వామన్రావ్.

'వేలంబుద్ధి ఎక్కడికి పోతుంది?... ఆనాడు బట్టల్ని వేలంవేశాడు...ఈనాడు కొడుకుని వేలం వేస్తున్నాడు... వేలంపాటను పెంచటానికి ఆరోజున ఎవరెవర్నో వాడుకున్నట్టు- కట్నంరేటును పెంచటానికి ఈరోజున ఆ శ్యామలరావ్‌ని వాడుకున్నాడన్నమాట!'- అతని అంతరాత్మ ఉపదేశించింది.

ఆ ఊహరాగానే, అతనిలోవున్న రక్తం ఉడికిపోయి కళ్ళల్లోకి చిమ్ముకొచ్చింది ... నరాల్లోవున్న శక్తి యావత్తూ పిడికిళ్ళకు చేరుకుంది...

"ఏమిటయ్యా...అలా అయిపోయావేమిటి?"- అడిగాడు ఆఫీసరు.

"ఏం లేదుసార్... ఆ అప్లికేషన్ ఇచ్చేయండి!"- అంటూ ఆయన చేతిలో వున్న దరఖాస్తును లాగేసుకున్నాడు.

"అదేం?" అర్థంకాలేదాయనకు.

"లోన్ అఖ్ఖర్లేదు!... మా అమ్మాయికి ఈ సంబంధం చేయను!"-అంటూ ఆవేశంగా బయటకు నడిచాడు వామన్రావ్!!

